

వికారాబాద్ డీఎంహెచ్‌వోగా పవిత్ర



వికారాబాద్, సెప్టెంబరు 30 (ఆంధ్ర జ్యోతి): వికారాబాద్ ఎంసీహెచ్ ప్రోగ్రాం అధికారిగా విధులు నిర్వహిస్తున్న పవిత్రను డీఎంహెచ్‌వోగా నియమించారు. కాగా, ఇప్పటివరకు ఇక్కడ డీఎంహెచ్‌వోగా విధులు నిర్వహించిన డాక్టర్ కె.లలితాదేవి రంగారెడ్డి జిల్లాకు బదిలీ అయ్యారు.



రాజుకున్న వేడి



పల్లెల్లో రాజకీయ సందడి

నేతలకు సవాల్‌గా మారిన పల్లెపోరు

అభ్యర్థుల ఎంపికపై మల్లగుల్లాలు

ఏకాభిప్రాయానికి మంతనాలు

తెరపైకి కొత్త ముఖాలు



స్థానిక సంస్థల ఎన్నికలకు షెడ్యూల్ విడుదల కావడంతో పల్లెల్లో రాజకీయ వేడి రాజుకుంది. నాలుగు దశల్లో జెడ్పీటీసీ, ఎంపీటీసీ, పంచాయతీ ఎన్నికలు జరగనుండటంతో నేతలంతా ఎన్నికల వ్యూహరచనలో తలమునకలయ్యారు. జెడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికలు పార్టీ గుర్తులపై జరుగుతుండడంతో ప్రధాన పార్టీలు వీటిపైనే ఎక్కువగా ఫోకస్ చేస్తున్నాయి. ఇప్పటికే అభ్యర్థుల వేటలో నేతలు బిజీ అయ్యారు.

(ఆంధ్రజ్యోతి, రంగారెడ్డి జిల్లా ప్రతినిధి)

7





దుర్గాదేవి అలంకరణలో..

దేవి శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా కీసర గుట్టలో తొమ్మిదో రోజు మంగళవారం దుర్గాదేవి అలంకరణలో అమ్మవారిని అలంకరించారు. అదే విధంగా కుంకుమార్చనతో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

-కీసర, సెప్టెంబర్30(ఆంధ్రజ్యోతి)



ఆక్రమణలను తొలగించాలి

ఇరిగేషన్ అధికారుకు హైడ్రా ఆదేశాలు



నాలా ఆక్రమణను పరిశీలిస్తున్న హైడ్రా అధికారులు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

ఘట్‌కేసర్, సెప్టెంబరు30(ఆంధ్రజ్యోతి): నాలా ఆక్రమణలను తొలగించేందుకు చర్యలు చేపట్టాలని హైడ్రా అధికారులు ఇరిగేషన్ అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. 'ఆక్రమణ.. ఆక్రందన' పేరుతో సెప్టెంబర్ 28వ తేదీన ఆంధ్రజ్యోతి దినపత్రికలో ప్రచురితమైన కథనానికి హైడ్రా అధికారులు స్పందించారు. మంగళవారం జోడిమెట్ల చౌరస్తా వద్ద ఆక్రమణకు గురైన నాలను హైడ్రా అధికారులు పరిశీలించారు. ఈ సందర్భంగా మాజీ మున్సిపల్ చైర్మన్ బోయపల్లి కొండల్‌రెడ్డి. స్థానిక హిమగిరి కాలనీవాసులు అక్కడికి చేరుకొని అధికారులకు తమ గోడు వెళ్లబోసుకున్నారు. వర్షం వస్తే చాలు తమ కాలనీతోపాటు పోచారం ప్రధాన రోడ్డుపై రెండు మూడు అడుగుల మేర వరద వచ్చి నిలుస్తున్నదని వివరించారు. వరదనీరు దిగువకు పోయే నాలాపై ప్రైవేటు పరిశ్రమ యాజమాన్యం నిర్మాణాలు చేపట్టడంతోనే ఇబ్బందులు తలెత్తుతున్నాయని వివరించారు. నాలాను పరిశీలించిన హైడ్రా ఇన్‌స్పెక్టర్ సైదులు వెంటనే ఇరిగేషన్, మున్సిపల్ అధికారులకు ఫోన్ చేసి సమస్య పరిష్కారానికి చర్యలు చేపట్టాలని సూచించారు. అనంతరం సమీపంలోని డాక్టర్స్ కాలనీలో ఆక్రమణకు గురైన లేఆవుట్‌లోని పార్కు స్థలాన్ని పరిశీలించారు. అక్కడికి వచ్చిన కాలనీవాసులు పార్కును ఆక్రమించిన విషయాన్ని హైడ్రా అధికారులకు వివరించారు. దీంతో సరైన ఆధారాలతో కార్యాలయంలో ఫిర్యాదు చేయాలని వారికి సూచించారు. కార్యక్రమంలో ఆయా కాలనీల ప్రతినిధులు, నాయకులు సామల బుచ్చిరెడ్డి, శ్రీనివాస్, హైడ్రా ఎస్ఐ ముజఫర్ తదితరులు పాల్గొన్నారు.





కాంగ్రెస్ హయాంలో

అభివృద్ధి శూన్యం

మాజీ మంత్రి, ఎమ్మెల్యే సబితాఇంద్రారెడ్డి

7
















నేడు రాజకీయ నేతలతో సమావేశం

వికారాబాద్, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి) : ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికల నేపథ్యంలో నేడు(బుధవారం) కలెక్టరేట్‌లో గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల నాయకులతో సమావేశం ఏర్పాటు చేసినట్లు జిల్లా ఎన్నికల అధికారి తెలిపారు. ఉదయం 11 గంటలకు ప్రారంభమయ్యే ఈ సమావేశంలో ప్రవర్తనా నియమావళి, శాంతి భద్రతలు, ఎన్నికల ఖర్చులు, తదితర సంబంధిత అంశాలపై చర్చ జరగనున్నట్లు వివరించారు. సమావేశానికి రాజకీయ పార్టీల జిల్లా అధ్యక్షులు, సంబంధిత అధికారులు హాజరు కావాలని ఆయన కోరారు.



ఘనంగా ఆయుధ పూజ

వికారాబాద్, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి): జిల్లా పోలీస్ కార్యాలయంలో బతుకమ్మ వేడుకలు, ఆయుధ పూజ నిర్వహించారు. బతుకమ్మ వేడుకల్లో కుటుంబ సమేతంగా పాల్గొన్న ఎస్పీ అనంతరం ఆయుధ పూజ, వాహన పూజలను నిర్వహించారు. విధి నిర్వహణలో ఉపయోగించే ఆయుధాలు, వాహనాలకు ఆయన ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం 41 సంవత్సరాల పాటు పోలీస్ ఉద్యోగం సేవలందించి ఎస్‌బీ ఎస్ఐ ఎండీ హాఫిజ్ ఉద్యోగ విరమణ సందర్భంగా ఆయనను ఘన సన్మానం నిర్వహించారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ రాములు నాయక్, సీఐలు, ఎస్ఐలు, ఆర్ఐలు మహిళా పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పకడ్బందీగా స్థానిక ఎన్నికలు

- అమల్లోకి ప్రవర్తనా నియమావళి
- హద్దు మీరితే కఠిన చర్యలు
- అనుమతి లేని హోర్డింగ్స్, ఫ్లెక్సీలు, వాల్‌రైటింగ్స్‌ను తొలగించాలి
- కలెక్టర్ నారాయణరెడ్డి ఆదేశాలు


సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ నారాయణరెడ్డి

ఇబ్రహీంపట్నం, సెప్టెంబరు 30(ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఎన్నికలను జిలాల్లో ప్రశాంత వాతావరణంలో, పారదర్శకంగా నిర్వహించేందుకు పకడ్బందీ చర్యలు తీసుకుంటున్నట్లు రంగారెడ్డి జిల్లా కలెక్టర్ నారాయణరెడ్డి అన్నారు. రాష్ట్ర ఎన్నికల సంఘం ఎన్నికల షెడ్యూల్‌ను ప్రకటించిన నేపథ్యంలో మంగళవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎన్నికల షెడ్యూల్ రాకతో జిల్లాలో ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమల్లోకి వచ్చిందన్నారు. ఎన్నికల కోడ్ ఉల్లంఘిస్తే చట్టపరంగా చర్యలు తీసకుంటామని హెచ్చరించారు.అధికారులు బాధ్యతగా విధులు నిర్వర్తించాలన్నారు. అనుమతి లేకుండా వాల్‌రైటింగ్స్, ఫ్లెక్సీలు, హోర్డింగులు, ఫొటోలు ఏర్పాటు చేస్తే తొలగిస్తామన్నారు. ఈ సందర్భంగా జెడ్పీటీసీ, ఎంపీటీసీ, పంచాయతీ ఎన్నికలు, కౌంటింగ్, ఫలితాలు, ఎన్నికల ప్రక్రియ గురించి వివరించారు. సమావేశంలో అదనపు కలెక్టర్ శ్రీనివాస్, జెడ్పీ సీఈవో కృష్ణారెడ్డి, డీపీవో సురేష్‌మోహన్‌లు పాల్గొన్నారు.

రెండు విడతల్లో జెడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికలు

జెడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికలు జిల్లాలో రెండు విడతల్లో జరుగుతాయి. తొలి విడత నోటిఫికేషన్ ఈ నెల 9న వస్తుంది. ఈ విడతలో చేవెళ్ల, కందుకూరు, రాజేంద్రనగర్ రెవెన్యూ డివిజన్లలోని 10 మండలాల్లో 110 ఎంపీటీసీ స్థానాలకు ఎన్నికలు జరుగుతాయి. వీటికి సంబంధించి 9 నుంచి 11వ తేదీ వరకు నామినేషన్లు స్వీకరిస్తారు. 12న పరిశీలన, అదే రోజు సాయంత్రం 5గంటల తర్వాత అభ్యర్థుల జాబితా ప్రకటిస్తారు. అభ్యంతరాలుంటే 13న అప్పీలు చేసుకోవచ్చు. 14న విచారణ జరుపుతారు. నామినేషన్ల ఉపసంహరణకు 15 వరకు అవకాశం ఉంటుంది. అదే రోజు అభ్యర్థుల జాబితా ప్రకటిస్తారు. అక్టోబరు 23న ఎన్నికలు, నవంబరు 11న ఓట్ల లెక్కింపు ఉంటుంది.

రెండో విడతకు సంబంధించి అక్టోబరు 13న షాద్‌నగర్, ఇబ్రహీంపట్నం డివిజన్లలోని 120 ఎంపీటీసీ స్థానాలకు నోటిఫికేషన్ విడుదల చేస్తామన్నారు. అదే రోజు నుంచి నామినేషన్లు స్వీకరించి ఈ నెల 15వ తేదీ నాటికి నామినేషన్ల పక్రియ పూర్తిచేస్తామన్నారు. 16న నామినేషన్ల పరిశీలన, ఉపసంహరణకు 19వ తేదీ తుది గడువుగా పేర్కొన్నారు. అనంతరం పోటీలో ఉన్న అభ్యర్థుల జాబితా ప్రకటిస్తామన్నారు. 27న రెండో విడత పోలింగ్, నవంబరు 11న కౌంటింగ్ జరుగుతుందన్నారు.

పంచాయతీ ఎన్నికలు ఇలా...

గ్రామపంచాయతీ ఎన్నికలు జిల్లాలో రెండు విడతల్లో జరుగుతాయి. తొలి విడత అక్టోబరు 31న చేవెళ్ల, కందుకూరు, రాజేంద్రనగర్ రెవెన్యూ డివిజన్ల పరిధిలోని 264 పంచాయతీలు, 2,300వార్డు స్థానాలకు ఎన్నికలు జరుగుతాయి. వీటికి అక్టోబరు 17న నోటిఫికేషన్ విడుదలవుతుంది. అదే రోజు నుంచి నామినేషన్లు స్వీకరిస్తారు. స్వీకరణకు అక్టోబరు 19 చివరి తేదీ. 20న నామినేషన్లు పరిశీలిస్తారు. 23 వరకు ఉపసంహరణ, అదే రోజు అభ్యర్థుల జాబితా ప్రకటిస్తారు. అక్టోబరు 31న ఉదయం 7నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు మొదటి విడత పోలింగ్ జరుగుతుంది. అదే రోజు మధ్యాహ్నం 2 నుంచి కౌంటింగ్ నిర్వహించి ఫలితాలు వెల్లడిస్తారు. అదే రోజు ఉప సర్పంచ్ ఎన్నికా ఉంటుంది.

అలాగే రెండో విడత పంచాయతీ ఎన్నికలు నవంబరు 4న 262 పంచాయతీలు, 2,368 వార్డు పదవులకు ఎన్నికలు జరుగుతాయి. అక్టోబరు 21న నోటిఫికేషన్ విడుదల చేస్తారు. అదే రోజు నుంచి 23 వరకు నామినేషన్లు స్వీకరిస్తారు. 24న నామినేషన్ల పరిశీలన, 27న ఉపసంహరణ, అదే రోజు అభ్యర్థుల జాబితా ప్రకటిస్తారు. నవంబరు 4న ఉదయం 7నుంచి ఒంటి గంట వరకు రెండో విడత పోలింగ్ ఉంటుంది. అదే రోజు మధ్యాహ్నం 2గంటల నుంచి కౌంటింగ్ నిర్వహించి ఫలితాలు వెల్లడిస్తారు.

ఎన్నికల విజయవంతానికి సహకరించాలి

స్థానిక సంస్థల ఎన్నికలు సజావుగా, ప్రశాంత వాతావరణంలో జరిపేందుకు రాజకీయ పార్టీలు, నేతలు సహకరించాలని కలెక్టర్ నారాయణరెడ్డి కోరారు. కలెక్టరేట్‌లో మంగళవారం రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. రాష్ట్ర ఎన్నికల కమిషన్ మార్గదర్శకాలను తప్పక పాటించాలన్నారు. ఎన్నికల కోడ్ వచ్చినందున ప్రభుత్వ కార్యాలయాల్లో వాల్‌రైటింగ్స్, ఫ్లెక్సీలు, హోర్డింగులు, ఫొటోలను 24గంటల వ్యవధిలో తొలంగించాలన్నారు. పబ్లిక్ ప్లేసుల్లో 48గంటల వ్యవధిలో, అనుమతి లేని ప్రైవేట్ స్థలాల్లో 72గంటల వ్యవధిలో తొలగించాలన్నారు. సమావేశంలో కాంగ్రెస్ నాయకులు అవుల యాదయ్య, నవీన్‌కుమార్, జంగారెడ్డి, బీఆర్ఎస్ నాయకులు సత్తు వెంకట రమణారెడ్డి, నిట్టు జగదీశ్వర్, బీజేపీ నుంచి శ్రీరాములు, దేవేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

కూసిన కోడ్.. తొలగిన ఫ్లెక్సీలు


పెంజర్లలో ఫ్లెక్సీలను తొలగిస్తున్న పంచాయతీ సిబ్బంది

కొత్తూర్, సెప్టెంబరు 29(ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఎన్నికల్లో తమ నాయకుడు జెడ్పీటీసీ, ఎంపీపీ, ఎంపీటీసీ, సర్పంచ్ పదవులు చేపడుతారంటూ భారీ ఖర్చుతో ఆయా పార్టీల నాయకులు స్వాగతం, సుస్వాగతం అని మండలంలోని వివిధ గ్రామాల్లో ఫ్లెక్సీలను ఏర్పాటు చేశారు. ఇంతలో స్థానిక ఎన్నికలకు నోటిఫికేషన్‌తో ఈ నెల 29 నుంచి ఎన్నికల కోడ్ వచ్చింది. ఇంకేముంది.. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు గ్రామాల్లో పంచాయతీ సిబ్బంది ఫ్లెక్సీలను తొలగించి చెత్త కుప్పల్లో పడేశారు. రిజర్వేషన్లు అనుకూలంగా రాని గ్రామాల్లో ఫ్లెక్సీలను తొలగించినా పట్టించుకోలేదు. ఏది ఏమైనా రిజర్వేషన్లు తారుమారుతో తమ నాయకుల ప్రచారం కోసం పెట్టిన భారీ ఖర్చుతో పార్టీల నాయకులు లబోదిబోమంటున్నారు.

జెడ్పీ చైర్‌పర్సన్ రేసులో నేనూ ఉన్నా...

- రాష్ట్ర ఫైనాన్స్ కమిషన్ సభ్యుడు ఎం.రమేశ్



తాండూరు, సెప్టెంబరు 30(ఆంధ్రజ్యోతి): వికారాబాద్ జిల్లా పరిషత్ చైర్మన్ బీసీలకు రిజర్వు అయిందున చైర్మన్ పదవి రేసులో తాను కూడా ఉన్నానని రాష్ట్ర ఫైనాన్స్ కమిషన్ సభ్యుడు ఎం.రమేశ్ అన్నారు. మంగళవారం ఆంధ్రజ్యోతితో ఆయన ప్రత్యేకంగా మాట్లాడారు. తాను ఎమ్మెల్యే టికెట్ త్యాగం చేసినప్పుడు రాజ్యసభ ఎంపీ లేదా ఎమ్మెల్సీ పదవి ఆశించానన్నారు. తన సీనియార్టీని గుర్తించి సీఎం రేవంత్‌రెడ్డి తనను రాష్ట్ర ఫైనాన్స్ కమిషన్ మెంబర్‌గా అవకాశం ఇచ్చారన్నారు. అయితే జడ్పీచైర్మన్ పదవిపై తాను ఇంకా సీఎంను కలవలేదని చెప్పారు. ఈ అశంపై తాను కుటుంబ సభ్యులతో, తన అనుచరులతో సమాలోచనలు చేస్తున్నామని తెలిపారు. జెడ్పీటీసీగా గెలిచి చైర్మన్ పదవిని పొందేందుకు తనకు అన్ని అర్హతలు ఉన్నాయని తెలిపారు.

హిందూ సంస్కృతిని భావి తరాలకు అందిస్తాం


ఆర్ఎస్ఎస్ దసరా ఉత్సవాల్లో పాల్గొన్న స్వయం సేవకులు

ధారూరు, సెప్టెంబరు 30(ఆంధ్రజ్యోతి): హిందూ ధర్మాన్ని, సంస్కృతిని, సంప్రదాయలను భావి తరాలకు అందించే విద్యుక్త ధర్మాన్ని రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ తీసుకుంటుందని ఆర్ఎస్ఎస్ తెలంగాణ ప్రాంత సంఘ్ చాలక్ సుందర్‌రెడ్డి అన్నారు. ఆర్ఎస్ఎస్ శతాబ్ది ఉత్సవాల్లో భాగంగా మంగళవారం ధారూరులో నిర్వహించిన దసరా ఉత్సవంలో ఆయన మాట్లాడారు. దేశానికి పునర్వైభవం తేవడమే సంఘ్ లక్ష్యమన్నారు. మాజీ సర్పంచ్ చంద్రమౌళి, స్వయం సేవకులు పాల్గొన్నారు.

అనాథలకు అమ్మానాన్న ఫౌండేషన్ చేయూత


చిన్నారులకు నూతన వస్త్రాలు, నిత్యావసర సరుకులు అందజేస్తున్న డిప్యూటీ డీఎంహెచ్‌వో, ఫౌండేషన్ సభ్యులు

కొడంగల్, సెప్టెంబరు 30(ఆంధ్రజ్యోతి): అమ్మానాన్న ఫౌండేషన్ ఆధ్వర్యంలో అనాథలకు చేయూతనివ్వడం అభినందనీయమని జిల్లా డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌వో రవీందర్‌యాదవ్ అన్నారు. ఫౌండేషన్ ఆధ్వర్యంలో మంగళవారం రాఘవేంద్ర ఫంక్షన్ హాలులో మండలంలోని వివిధ గ్రామాల అనాథ పిల్లలకు రవీందర్‌యాదవ్, టీవీవీ రాష్ట్ర కార్యదర్శి రవీందర్‌గౌడ్, ఫౌండేషన్ వ్యవస్థాపకుడు ప్రవీణ్‌కుమార్ నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. దసరా కానుకగా నూతన వస్త్రాలు, విద్యాబోధనకు సంబంధించిన స్టేషనరీ అందజేశారు. మానవ సేవ మాధవ సేవగా ప్రతీ ఒక్కరూ సేవా కార్యక్రమాల్లో పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో టీవీవీ నాయకులు బాకారం చంద్రశేఖర్, గౌరారం గోపాల్, నవీన పాఠశాల ప్రిన్సిపాల్ డివి.నరేశ్‌రాజ్, మాజీ కౌన్సిలర్ శంకర్‌నాయక్, సనాతన ధర్మ పరిరక్షణ కమిటీ సభ్యులు లక్ష్మీనారాయణగుప్తా, మిఠాయి రాజు, ఫౌండేషన్ సభ్యులు పాల్గొన్నారు.


వెంకటేశ్వర్‌రావును సన్మానిస్తున్న కలెక్టర్ నారాయణరెడ్డి, తదితరులు

మంచి పనులే గుర్తింపునిస్తాయి

ఇబ్రహీంపట్నం, సెప్టెంబరు 30(ఆంధ్రజ్యోతి): ఉద్యోగ జీవితంలో చేసిన మంచి పనులే గుర్తింపునిస్తాయని కలెక్టర్ నారాయణరెడ్డి అన్నారు. మంగళవారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం భవనంలో జిల్లా వైద్యాధికారి వెంకటేశ్వర్‌రావు పదవీ విరమణ కార్యక్రమంలో ఆయనను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఉద్యోగ విరమణ అనేది ప్రతి ప్రభుత్వ ఉద్యోగికి తప్పదన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ చంద్రారెడ్డి, డీఆర్వో సంగీత ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

హనుమంత వాహనంపై వేంకటేశ్వరుడు


లక్ష్మీవేంకటేశ్వర స్వామి వారిని ఊరేగిస్తున్న భక్తులు

చేవెళ్ల, సెప్టెంబరు 30(ఆంధ్రజ్యోతి):దసరా ఉత్సవాలను పురస్కరించుకొని చేవెళ్లలోని లక్ష్మీవేంకటేశ్వర స్వామి ఆలయ బ్రహ్మోత్సవాలను నిర్వహిస్తున్నారు. రోజూ ప్రత్యేక పూజలు చేస్తున్నారు. మంగళవారం వేంకటేశ్వరుడికి హనుమంత వాహన సేవ నిర్వహించారు. మహిళలు కోలాటాలతో ఆకట్టుకున్నారు. భక్తులతో ఆలయం కిటకిటలాడుతోంది. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త దేవుని వామనాచార్యులు, అర్చకులు అనంతం, వాసు, శ్రీపాదు, కన్నా, వైభవ్, సృజన్, తదితరులు ఉన్నారు.

మునిసిపల్ కార్మికులకు దసరా కానుక

ప్రతీ కార్మికుడి రెండు వేలు అందజేత ● ఎమ్మెల్యే శంకర్ ఔదార్యం


మున్సిపల్ సిబ్బందికి డబ్బు అందజేస్తున్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

షాద్‌నగర్ అర్బన్, సెప్టెంబరు 30(ఆంధ్రజ్యోతి):షాద్‌నగర్ మున్సిపల్ కార్మికులకు ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ పండుగ నజరానా అందించారు. మున్సిపల్ కార్యాలయంలో మంగళవారం కమిషనర్ సునీత ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమానికి హాజరైన ఎమ్మెల్యే ప్రతి కార్మికుడికి తన సొంతడబ్బు రూ.రెండువేల చొప్పున అందించారు. 140 మందికి డబ్బు అందజేశారు. నిత్యం పారిశుధ్య నిర్వహణతో ప్రజల ఆరోగ్యాలను కాపాడుతున్న కార్మికుల దసరా పండుగ కోసం నగదును ఇచ్చానని ఎమ్మెల్యే చెప్పారు. కార్మికుల శ్రమను గుర్తించి పట్టణ ప్రజలు సైతం పారిశుధ్యాన్ని కాపాడటంతో తమ వంతు సహకారం ఇవ్వాలని శంకర్ పిలుపునిచ్చారు. కార్యక్రమంలో షాద్‌నగర్ మార్కెట్ కమిటీ వైస్‌చైర్మన్ బాబర్‌ఖాన్, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

జూనియర్ అసిస్టెంట్ల నుంచి ఆఫీసర్లుగా...


కె.అక్షయ్‌కుమార్ ఐ.కల్యాణ్

కీసర/మాడ్గుల, సెప్టెంబరు 30(ఆంధ్రజ్యోతి): ఇద్దరు జూనియర్ అసిస్టెంట్లు గ్రూప్-1, 2 ఆఫీసర్లుగా ఉద్యోగాలు సాధించారు. కీసర ఆర్డీవో, తహసీల్దార్ కార్యాలయాల్లో కె.అక్షయ్‌కుమార్, ఐ.కల్యాణ్‌లు జూనియర్ అసిస్టెంట్లుగా విధులు నిర్వహిస్తున్నారు. హయత్‌నగర్‌కు చెందిన అక్షయ్‌కుమార్, ఉప్పల్‌కు చెందిన కల్యాణ్ కీసరలో విధులు నిర్వహిస్తునే గ్రూప్-1, 2 పరీక్షలకు సన్నద్ధమయ్యారు. అక్షయ్‌కుమార్ గ్రూపు-1లో 784 ర్యాంక్‌తో ఎంపీడీవోగా, గ్రూపు-2లో 1,190ర్యాంక్‌తో కమర్షియల్ ట్యాక్స్ డిపార్ట్‌మెంట్‌లో ఉద్యోగం సాధించాడు. కల్యాణ్ గ్రూపు-2లో 1,280 ర్యాంక్‌తో ఎక్సైజ్ ఎస్సై ఉద్యోగం సాధించాడు. వారికి కీసర ఆర్డీవో ఉపేందర్‌రెడ్డి, తహసీల్దార్ అశోక్, తోటి అధికారులు, ఉద్యోగులు శుభాకంక్షాలు, అభినందనలు తెలిపారు. అలాగే మాడ్గుల మండలం జయరామ్‌తండా వాసి వడ్త్యావత్ ఫణిరాజ్‌నాయక్ గ్రూప్1లో ప్రతిభతో డిప్యుటీ కలెక్టర్ ఉద్యోగం సాధించాడు. దేవీలాల్-నీలాబాయిల కుమారుడు ఫణిరాజ్. వ్యవసాయం సాగక వారి కుటుంబం 25ఏళ్ల క్రితం హైదరాబాద్‌కు వలస వెళ్లింది. దేవీలాల్ దంపతులు గృహ నిర్మాణ కార్మికులుగా పనిచేస్తున్నారు. కష్టపడి కొడుకు, కూతురిని చదివించారు. ఫణిరాజ్ వరంగల్ ఎన్ఐటీలో ఇంజినీరింగ్ పూర్తి చేశారు. కూతురు ప్రియాంకదేవి బీడీఎస్ చేశారు. కాగా ఫణిరాజ్ క్యాంపస్ సెలక్షన్స్‌లో ఐవోసీలో జాబ్ చేస్తూనే గ్రూప్స్‌కు ప్రిపేరై ఉద్యోగం సాధించాడు. సీఎం రేవంత్‌రెడ్డి నుంచి నియామక పత్రం అందుకున్నాడు. ఇదిలా ఉంటే మంగళవారం తండాకు వచ్చిన ఫణిరాజ్‌ను స్థానికులు సత్కరించారు.


ఫణిరాజ్, అతడి తల్లిదండ్రులను సత్కరిస్తున్న తండా వాసులు

మాజీ ఎమ్మెల్యేను కలిసిన పైలెట్ రోహిత్‌రెడ్డి

- స్థానిక ఎన్నికల నేపథ్యంలో రాజకీయాలపై చర్చ


నారాయణరావుతో మాట్లాడుతున్న రోహిత్‌రెడ్డి

బషీరాబాద్, సెప్టెంబరు 30(ఆంధ్రజ్యోతి): మాజీ ఎమ్మెల్యే ఎం.నారాయణరావును తాజా మాజీ ఎమ్మెల్యే పైలెట్ రోహిత్‌రెడ్డి మంగళవారం బషీరాబాద్‌లోని ఆయన నివాసంలో కలిశారు. ఈ సందర్భంగా ఇద్దరు నాయకులు స్థానిక సంస్థల ఎన్నికల ఆంశంతో పాటు, నియోజకవర్గ రాజకీయాంశాలపై చర్చించుకున్నట్టు తెలిసింది. స్థానికంగా వివిధ పార్టీల బలాబలాలపై అభిప్రాయాన్ని పంచుకున్నట్టు సమాచారం. బషీరాబాద్ ఎంపీపీ, జెడ్పీటీసీ స్థానాలు బీసీలకు రిజర్వు అయినందున మీ కుటుంబం నుంచి బీఆర్ఎస్ తరఫున పోటీ చేస్తే బాగుంటుందని రోహిత్‌రెడ్డి నారాయణరావు వద్ద ప్రస్తావించినట్లు సమాచారం. తాను ఏ పార్టీ నుంచి పోటీ చేయాలనేది ఇంకా నిర్ణయించుకోలేదని రోహిత్‌రెడ్డికి నారాయణరావు చెప్పినట్టు తెలిసింది. స్థానిక సంస్థల ఎన్నికల సమయంలో రోహిత్‌రెడ్డి.. నారాయణరావు ఇంటికి వెళ్లి కలవడం మండలంలో రాజకీయంగా చర్చనీయంశమైంది.

కనుల పండువగా శ్రీవారి రథోత్సవం



శ్రీవారి రథోత్సవంలో కోలాటం ఆడుతున్న భక్తులు

వికారాబాద్‌లోని శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయ రజతోత్సవాలు పదో రోజు మంగళవారం కనుల పండువగా నిర్వహించారు. ఆలయంలో సుప్రభాత సేవ, మహాభిషేకం, నైవేద్యం, మంగళహారతి, అర్చన తదితర పూజలు చేశారు. సాయంత్రం పట్టణంలో నిర్వహించిన రథోత్సవంలో వందలాది మంది పాల్గొన్నారు. మహిళలు కోలాటం, నృత్యాలతో రథత్సవంలో పాల్గొన్నారు. ప్రధాన వీధులగుండా స్వామి వారిని ఊరేగించారు. వేడుకల్లో ధర్మకర్త లక్ష్మీనారాయణ, ఆలయ నిర్వాహకులు, భక్తులు పాల్గొన్నారు.

వికారాబాద్, సెప్టెంబరు 30(ఆంధ్రజ్యోతి)



స్వామి వారి రథోత్సవం



పూజలు నిర్వహిస్తున్న పండితుడు





సింహవాహన సేవలో అనంతుడు

వికారాబాద్, సెప్టెంబర్ 30 (ఆంధ్రజ్యోతి): శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఆలంపల్లి శ్రీ అనంతపద్మనాభ స్వామి ఆలయంలో బ్రహ్మోత్సవాలు కనుల పండువగా నిర్వహిస్తున్నారు. నిత్య వాహన పూజలో భాగంగా మంగళవారం స్వామి వారిని సింహ వాహన సేవపై ఊరేగించారు. ఆలయ పరిసరాలలు, గ్రామ పుర వీధుల నుంచి స్వామి వారిని ఊరేగించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ ప్రధాన పూజారి పద్మనాభం, కార్య నిర్వాహణాధికారి నరేందర్ పాల్గొన్నారు.



నందిగామ: చెక్కు అందజేస్తున్న నాయకులు

ఆర్థికసాయం అందజేత

కేశంపేట/నందిగామ, ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి): కేశంపేట మండలం కాకునూరుకు చెందిన కర్రోళ్ల లక్ష్మమ్మ సోమవారం మృతిచెందింది. విషయం తెలుసుకున్న మాజీ జెడ్పీటీసీ విశాలశ్రావణ్‌రెడ్డి లక్ష్మమ్మ కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపి కాంగ్రెస్ నాయకుల ద్వారా రూ.5వేలు అందించారు. పరామర్శించిన వారిలో మాజీ ఉపసర్పంచ్‌లు తైద పర్వతాలు, నాగిరెడ్డి, కాంగ్రెస్ గ్రామ అధ్యక్షుడు శ్రీశైలం, కిసాన్ సెల్ మండలాధ్యక్షుడు కోడూరు రాములు, కోడూరు నరసింహులు, ఎదిరె శ్రీశైలం, ఎదిరె మల్లేష్, పి.లింగం, సొంటి చెన్నయ్య, కరికె శ్రీనివాస్, కోడిగంటి జంగయ్య, పోరండ్ల మల్లేష్ ఉన్నారు. నందిగామకు చెందిన రమేష్ జర్నలిస్టుగా పనిచేస్తూ గతేడాది అనారోగ్యంతో మృతిచెందాడు. తెలంగాణ మీడియా అకాడమీ సంక్షేమ నిధి నుంచి మంజూరైన రూ.లక్ష చెక్కును రమేష్ భార్యకు టీయూడబ్ల్యూజే(ఐజేయూ) రాష్ట్ర కమిటీ కన్వీనర్ గుడుపల్లి శ్రీనివాస్ స్థానిక జర్నలిస్టులతో కలసి మంగళవారం షాద్‌నగర్‌లో అందజేశారు. నెలకు రూ.3వేల పింఛన్, ఇద్దరు పిల్లలకు రూ.వెయ్యి చొప్పున ట్యూషన్ ఫీజు ఇస్తామని శ్రీనివాస్ తెలిపారు.

స్థానిక ఎన్నికల్లో కాంగ్రెస్‌కు గుణపాఠం తప్పదు



మాట్లాడుతున్న ఉప్పల వెంకటేశ్

తలకొండపల్లి, సెప్టెంబరు 30(ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్ఎస్ ఘన విజయం సాధిస్తుందని, కాంగ్రెస్‌కు గుణపాఠం తప్పదని మిషన్ భగీరథ రాష్ట్ర మాజీ వైస్‌చైర్మన్, తలకొండపల్లి మాజీ జెడ్పీటీసీ ఉప్పల వెంకటేశ్ అన్నారు. ఆమనగల్లులో మంగళవారం విలేకరులతో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ ప్రజల విశ్వాసం కోల్పోయిందని, బీఆర్ఎస్‌ను ఆదరిస్తున్నారన్నారు. కాంగ్రెస్ పాలనలో ప్రచారార్భాటమే తప్ప ప్రగతి లేదన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి ఫ్యూచర్ సిటీ నిర్మిస్తానని ప్రగల్భాలు పలుకుతున్నారని ఎద్దేవా చేశారు. ఓటు ద్వారా ప్రజలు కాంగ్రెస్‌కు బుద్ధి చెబుతారన్నారు. స్థానిక ఎన్నికల అనంతరం కాంగ్రెస్‌కు పతనం తప్పదన్నారు. నాయకులు గోపాల్ నాయక్, వెంకట్ రెడ్డి, పద్మనర్సింహ, జ్యోతయ్య, బుచ్చిబాబు, నాగిళ్ల జగన్ పాల్గొన్నారు.

ఒకే కుటుంబానికి మూడు పదవులు

- ఎస్టీ రిజర్వేషన్‌తో విచిత్ర పరిస్థితి
- ఆ గ్రామంలో ఒక్కటే కుటుంబం

బషీరాబాద్, సెప్టెంబరు 30(ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఎన్నికలకు ప్రభుత్వం రిజర్వేషన్లు ప్రకటించిన నేపథ్యంలో పలు గ్రామాల్లో విచిత్ర పరిస్థితులు కనిపిస్తున్నాయి. బషీరాబాద్ మండలం మంతన్‌గౌడ్ పంచాయతీ పరిధిలో 8వార్డులు ఉండగా, 449 మంది ఓటర్లు ఉన్నారు. అక్కడ సర్పంచ్ ఎస్టీకి రిజర్వయింది. కాగా, గ్రామంలో ఎస్టీ సామాజిక వర్గానికి చెందిన ఒకే ఒక ఎస్టీ కుటుంబం ఉంది. ఆ ఇంట్లో ఆరుగురు ఓటర్లు ఉన్నారు. వారిలో తల్లిదండ్రులు ఎరుకల భీమప్ప, వెంకటమ్మలతో పాటు ఇద్దరు కుమారులు, కోడళ్లు ఉన్నారు. పంచాయతీకి ఎస్టీకి రిజర్వ్ కావడంతో భీమప్ప కుటుంబంలో నుంచి ఒకరు సర్పంచ్, రెండు వార్డు సభ్యుల పదవులకు పోటీ పడాల్సి ఉంది. లేదా ఆ కుటుంబం నుంచి సర్పంచ్, రెండు వార్డుల పదవులకు ఏకగ్రీవం చేయాల్సిన పరిస్థితి. ఈ నేపథ్యంలో ఆ ఒక్క కుటుంబానికి మూడు పదవులు వరించే అవకాశం ఉంది. ఇదిలా ఉండగా మండలంలోని దామర్‌చెడ్, గంగ్వార్ గ్రామ పంచాయతీలో ఎస్సీ కులుంబాలు ఉన్నప్పటికీ ఒక్క వార్డుకు రిజర్వేషన్ రాకపోవడంతో వార్డు సభ్యుల పదవులు దక్కే అవకాశాలు లేకపోవడంతో ఆయా కుటుంబాల వారు ఆందోళన వ్యకం చేస్తున్నారు.

బ్యాడ్మింటన్ విజేత అనన్య జోడీ



పతకాలు ప్రదానం చేస్తున్న రామ్మోహన్‌రెడ్డి, జ్వాల

హైదరాబాద్(ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి): వేమూరి సుధాకర్ స్మారక తెలంగాణ సబ్ జూనియర్ ఓపెన్ బ్యాడ్మింటన్ టోర్నమెంట్ బాలికల డబుల్స్ అండర్-17 విభాగంలో అనన్యరెడ్డి-చంద్రిక జోడీ విజేతగా నిలిచింది. మంగళవారం మొయినాబాద్‌లోని గుత్తా జ్వాల అకాడమీలో జరిగిన ఈ పోటీల అండర్-17 ఫైనల్లో అనన్య-చంద్రిక(గేమ్‌పాయింట్ అకాడమీ) జోడీ 15-13, 15-18తో అదితి-లక్ష్య(జ్వాల అకాడమీ)పై గెలిచి, టైటిల్ దక్కించుకుంది. బాలుర డబుల్స్‌లో గౌతం-హర్ష ద్వయం, మిక్స్‌డ్ డబుల్స్‌లో మహిధర్-గ్రేస్ జంట, సింగిల్స్‌లో అఖిలేష్, మహిళల సింగిల్స్ మాన్య టైటిళ్లు సాధించారు. పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్ రెడ్డి, పద్మశ్రీ ఎస్.ఎం ఆరీఫ్, వెటరన్ షట్లర్ గుత్తా జ్వాల విజేతలకు ట్రోఫీలు ప్రదానం చేశారు.

శాంతి భద్రతల విషయంలో రాజీ పడొద్దు

కేశంపేట, సెప్టెంబరు 30(ఆంధ్రజ్యోతి): శాంతి భద్రతల పరిరక్షణ విషయంలో పోలీసులు రాజీ పడొద్దని శంషాబాద్ డీసీపీ రాజేష్ సూచించారు. మంగళవారం కేశంపేట పోలీస్‌స్టేషన్‌ను షాద్‌నగర్ ఏసీపీ లక్ష్మీ నారాయణతో కలిసి సందర్శించారు. స్టేషన్‌లో నేర నియంత్రణకు తీసుకుంటున్న చర్యలపై సీఐ నరహరిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం మాట్లాడుతూ.. స్థానిక సంస్థల ఎన్నికల్లో నిబంధనలు కచ్చితంగా పాటించాలని సూచించారు. మోడల్ కోడ్ ఆఫ్ కాండక్ట్‌ను పకడ్బందీగా అమలు చేయాలన్నారు. పోలీసులు ప్రజలకు అందుబాటులో ఉండి, వారి సమస్యలను పరిష్కరిస్తుండటం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో ఎస్ఐ రాజ్‌కుమార్, ఏఎస్ఐలు శ్రీనివాస్, నర్సింలు, కానిస్టేబుళ్లు పాల్గొన్నారు.

రాజుకున్న వేడి

పల్లెల్లో రాజకీయ సందడి.. నేతలకు సవాల్‌గా మారిన పల్లెపోరు

- అభ్యర్థుల ఎంపికపై మల్లగుల్లాలు
- ఏకాభిప్రాయానికి మంతనాలు
- తెరపైకి కొత్త ముఖాలు



(ఆంధ్రజ్యోతి, రంగారెడ్డి జిల్లా ప్రతినిధి): అసెంబ్లీ ఎన్నికల తరువాత జరుగుతున్న ఈ స్థానిక ఎన్నికలు రాజకీయ నేతలకు సవాల్‌గా మారాయి. దీంతో ఆయా పార్టీలకు చెందిన ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఎంపీలు ఈ ఎన్నికలను ప్రతిష్టాత్మకంగా తీసుకుంటున్నారు. ప్రధానంగా అధికార కాంగ్రెస్ పార్టీకి ఈ ఎన్నికలు ఎంతో కీలకంగా మారాయి. గత అసెంబ్లీ ఎన్నికల్లో ఉమ్మడి జిల్లాలో కాంగ్రెస్‌కు ఆశించిన ఫలితాలు రాలేదు. కొంత గ్రామీణ ప్రాంతాల్లో సీట్లు వచ్చినప్పటికీ పట్టణ ప్రాంతాల్లో బోణీ చేయలేదు. అయితే ఈ స్థానిక ఎన్నికల తరువాత మున్సిపల్ ఎన్నికలు జరగనున్నాయి. ఇపుడు జరిగే జెడ్పీటీసీ, ఎంపీటీసీ, పంచాయతీ ఎన్నికల ఫలితాల ప్రభావం వచ్చే మున్సిపల్ ఎన్నికలపై కూడా ఉండనుంది. దీంతో అధికార పార్టీ ఈ ఎన్నికలను సవాల్‌గా తీసుకుంది. స్థానిక ఎన్నికల్లో వందశాతం ఫలితాలు సాధించాలని సీఎం రేవంత్‌రెడ్డి ఉమ్మడి జిల్లా పర్యటనలో ఇటీవల స్థానిక నేతలకు దిశానిర్దేశం చేశారు. స్థానిక ఎమ్మెల్యేలు బాధ్యత తీసుకోవాలని సూచించారు. దీంతో క్షేత్రస్థాయిలో ఎన్నికల ప్రచార రంగంలో ఎమ్మెల్యేలు దిగారు. అభ్యర్థుల ఎంపిక విషయంలో ఏకాభిప్రాయ సాధనకు ప్రయత్నిస్తున్నారు. నేతల మధ్య సఖ్యత కుదిర్చేందుకు రోజువారీ మంతనాల్లో బీజీగా గడుపుతున్నారు. మరో వైపు పంచాయతీ పోరులో తమ పార్టీ నేతలు, సానుభూతిపరులను రంగంలో దింపేందుకు ప్రయత్నిస్తున్నారు. గ్రామాల్లో సర్పంచ్, వార్డు పదవులకు ఎక్కువగా పోటీ ఉండడంతో ఓట్లు చీలిపోకుండా ఏకగ్రీవంగా ఎన్నికలు జరిపేందుకు ప్రయత్నిస్తున్నారు.

గట్టి పోటీ ఇచ్చేలా..

అదే విధంగా ప్రతిపక్షాలు కూడా స్థానిక పోరుకు సిద్ధమవుతున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో పట్టుసాధించేందుకు తీవ్రంగా ప్రయత్నిస్తున్నాయి. ప్రధాన ప్రతిపక్షమైన బీఆర్ఎస్ కూడా ఈ ఎన్నికల్లో గట్టిగా పోటీ ఇచ్చేందుకు ప్రయత్నిస్తోంది. బీఆర్ఎస్ క్షేత్రస్థాయిలో ఇప్పటికే ఇందుకు సంబంధించిన కార్యాచరణకు దిగింది. బీఆర్ఎస్‌కు బలమైన కేడర్ ఇంకా ఉండడంతో పల్లెపోరులో సత్తా చాటేయత్నం చేస్తోంది. అధికార పార్టీలో సీటు ఆశించి భంగపడే వారంతా తమ వైపు వస్తారనే భరోసాతో బీఆర్ఎస్ ఉంది. మరో వైపు బీజేపీ కూడా ఈసారి స్థానిక ఎన్నికలను సవాల్‌గా తీసుకుంది. ఇప్పటికే పట్టణ ప్రాంతాల్లో ఎంతో కొంత పట్టుసాధించిన బీఆర్ఎస్ పల్లెలపై దృష్టిసారించింది. బీజేపీ అనుబంధ సంస్థలు క్షేత్రస్థాయిలో ఎన్నికల వ్యూహాలు అమలు చేస్తున్నాయి. బీజేపీ ముఖ్యనేతలు, నగర, శివారు ప్రాంత నేతలకు పల్లెల్లో ప్రచార బాధ్యతలు అప్పగిస్తున్నారు.

తెరపైకి కొత్త ముఖాలు

స్థానిక ఎన్నికలకు రిజర్వేషన్లు ఖరారు కావడంతో పల్లెల్లో రాజకీయ వాతావరణం ఒక్కసారిగా మారిపోయింది. రిజర్వేషన్ల ఖరారుతో పోటీకి ముందు వరసలో ఉన్న పలువురు నేతల ఆశలు అడియాసలయ్యాయి. ఆయా ప్రాంతాల్లో రిజర్వేషన్లు ఊహలకు భిన్నంగా ఖరారు కావడంతో సీనియర్ నేతలు కంగుతిన్నారు. వాస్తవానికి కొందరు నేతలు కొన్నాళ్లుగా తమ ప్రాంతాల్లో ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని భారీగా ఖర్చు పెట్టారు. కొన్ని పంచాయతీల్లో ఇప్పటికే రూ.లక్షల్లో ఖర్చుపెట్టిన వారు అనేక మంది ఉన్నారు. ఇపుడు వీరి పరిస్థితి అయోమయంగా మారింది. అయితే వీరిలో కొందరు రాజకీయంగా తమ ప్రాంతాల్లో పట్టుజారకుండా ఉండేందుకు తమ కుటుంబ సభ్యులను, అనుచరులను ఎన్నికల బరిలో దింపే యత్నం చేస్తున్నారు. దీంతో అనేక చోట్ల ఇపుడు కొత్త ముఖాలు తెరపైకి వచ్చే అవకాశం ఉంది.

కాంగ్రెస్ హయాంలో అభివృద్ధి శూన్యం

- మాజీ మంత్రి, ఎమ్మెల్యే సబితాఇంద్రారెడ్డి



మాట్లాడుతున్న మాజీ మంత్రి, ఎమ్మెల్యే సబితారెడ్డి

నవాబుపేట, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి 22 నెలలు గడుస్తున్నా కోతలు తప్ప అభివృద్ధి శూన్యమని మాజీ మంత్రి, ఎమ్మెల్యే సబితాఇంద్రారెడ్డి ఆరోపించారు. మంగళవారం మండల కేంద్రంలోని లింగంపల్లి లక్ష్మారెడ్డి గార్డెన్‌లో నిర్వహించిన బీఆర్ఎస్ సన్నాహాక సమావేశంలో ఆమె మాట్లాడారు. వంద రోజుల్లో ఎన్నికల హామీలను అమలు చేస్తామని నమ్మించి ఓట్లు దండుకొని గద్దెనెక్కారని మండిపడ్డారు. రైతులు అతివృష్టికి గురై పంటలు నష్టపోయినా పట్టించుకోవడం లేదన్నారు. మహిళలను కోటీశ్వరులను చేస్తామని చెబుతున్న కాంగ్రెస్ ప్రభుత్వం హామీలే తప్ప చేసిందేమీ లేదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను ఎండగడుతూ స్థానిక సంస్థల ఎన్నికల్లో పూర్తి మెజారిటీ సీట్లు సాధించేందుకు పార్టీ నాయకులు, కార్యకర్తలు సైనికుల్లా పని చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు మెతుకు ఆనంద్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అభివృద్ధిని పక్కకు పెట్టి కుట్ర పూరిత రాజకీయం చేస్తుందని ఆరోపించారు. గతంలో స్పీకర్ ప్రసాద్‌కుమార్ రోడ్ల దుస్థితిపై కామెంట్ చేసిన విషయం మర్చిపోయారన్నారు. నేడు అధికారంలో ఉండి కూడా ఆయన చేసిందేమి లేదన్నారు. మూలమడ, చించల్‌పేట్, కేశవపల్లి, చిట్టిగిద్ద గ్రామాలకు చెందిన పలువురు బీజేపీ, కాంగ్రెస్ పార్టీ నాయకులు సబితాఇంద్రారెడ్డి సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. సమావేశంలో విద్యా మౌలిక వసతుల మాజీ చైర్మన్ నాగేందర్‌గౌడ్, బీసీ కమిషన్ మాజీ సభ్యుడు శుభప్రద్‌పటేల్, బీఆర్ఎస్ నాయకులు పట్లోళ్ల భరత్‌రెడ్డి, దయాకర్‌రెడ్డి, శాంతకుమార్, విజయ్‌కుమార్, మంచంపల్లి సురేశ్, జగన్‌రెడ్డి, సుభాన్‌రెడ్డి, టైగర్ భూమోళ్ల కృష్ణయ్య, ప్రభాకర్‌రెడ్డి, గౌస్, మహేశ్‌రెడ్డి, బందెయ్య గౌడ్, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.



ఎమ్మెల్యేగారూ.. కుర్చీ కేటాయించాం రండి

నవాబుపేట మండల కేంద్రంలోని లక్ష్మారెడ్డి గార్డెన్‌లో మంగళవారం బీఆర్ఎస్ కార్యకర్తల సన్నాహక సమావేశం నిర్వహించారు. సమావేశానికి మాజీ మంత్రి, ఎమ్మెల్యే సబిత ఇంద్రారెడ్డి, బీఆర్ఎస్ నాయకులు హాజరయ్యారు. ఈ సమావేశంలో స్టేజీపై ఎమ్మెల్యే కాలె యాదయ్యకు కుర్చీ కేటాయించినా ఖాళీగా ఉండటంతో ఎమ్మెల్యే గారు రండి కూర్చోండని బీఆర్ఎస్ నాయకులు కోరడం గమనార్హం.



నిరసన తెలిపితే కేసులు పెడతారా?

- పోలీసుల తీరుపై డీజీపీకి ఫిర్యాదు చేస్తాం
- బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు బాబయ్య



సమావేశంలో మాట్లాడుతున్న అందె బాబయ్య

షాద్‌నగర్ అర్బన్,సెప్టెంబరు30(ఆంధ్రజ్యోతి): వాగులో పడి ప్రాణాలు కోల్పోయిన దస్తగిరి లింగం కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని నిరసన వ్యక్తం చేసిన వారిపై కేసులు నమోదు చేయడమేమిటని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు అందె బాబయ్య ఆగ్రహం వ్యక్తం చేశారు. షాద్‌నగర్ ఏబీ కాంప్లెక్స్‌లో మంగళవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కొందుర్గు మం డలం ఎంకిరాలకు చెందిన దస్తగిరి లింగం అనే వ్యక్త విశ్వనాథ్‌పూర్ వద్ద వాగు దాటుతూ ప్రమాదవశాత్తు దానిలో పడి కొట్టుకుపోయి చనిపోయాడని గుర్తుచేశారు. కూలి పనిచేస్తూ భార్య, ము గ్గురు కుమార్తెలను పోషిస్తున్న లింగం కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని ఎమ్మెల్యే క్యాంప్ ఆఫీసు వద్ద నిరసన తెలిపారన్నారు. ఈ విషయం ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌కు చెప్పి ప్రభుత్వ పరంగా ఆదుకుంటారనే నిరసన వ్యక్తం చేశారన్నా రు. తంగెడుపల్లి బ్రిడ్జి నిర్మాణం పూర్తయి ఉంటే లింగం మరణించే వాడు కాదని, అతడి మరణానికి ప్రభుత్వ నిర్లక్ష్యమే కారణమన్నారు. పేద కుటుంబాన్ని ఆదుకోవాలని ప్రశ్నించిన బీజేపీ కార్యకర్త పసుల ప్రశాంత్, మరో 14 మందిపై పెట్టిన కేసులను ఎత్తివేయాలని బాబయ్య డిమాండ్ చేశారు. లేకుంటే పోలీసులపై డీజీపీకి ఫిర్యాదు చేస్తామన్నారు. సమావేశంలో నాయకులు నర్సింహయాదవ్, పి.ప్రశాంత్, లక్ష్మీకాంత్ రెడ్డి, మహేందర్‌రెడ్డి, హరిభూషన్ పటేల్, రాధిక, రాజు, అరవింత్ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీవో జగదీశ్వర్‌రెడ్డి

స్థానిక ఎన్నికలను పకడ్బందీగా నిర్వహించాలి

కందుకూరు, సెప్టెంబరు 30(ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఎన్నికలను అధికారులు, సిబ్బంది పకడ్బందీగా నిర్వహించాలని రెవెన్యూ డివిజనల్ ఆఫీసర్ జగదీశ్వర్‌రెడ్డి అన్నారు. మంగళవారం కందుకూరు, మహేశ్వరం, కడ్తాల్, తలకొండపల్లి, ఆమనగల్లు మండలాల రిటర్నింగ్ అధికారులతో ఎంపీడీవో కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. జెడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల నిర్వ హనకు ఓటరు లిస్టులు సిద్ధం చేయడం, పోలింగ్ కేంద్రాల ఏర్పాటు, అవసరమయ్యే సామగ్రి, బ్యాలెట్ బాక్సులు భద్రపర్చడం వంటి కార్యక్రమాలను పటిష్టంగా చేపట్టాలని ఆదేశించారు. పోలింగ్ అనంతరం బ్యాలెట్ బాక్స్‌లను కౌంటింగ్ కేంద్రాలకు చేరవేసేందుకు కావాల్సిన ఏర్పాట్లకు చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో తహసీల్దార్లు కె.గోపాల్, చిన్నప్పలనాయుడు, ముంతాజ్ బేగం, ఎంపీడీవోలు సరిత, సుజాత, శైలజ, నియోజకవర్గ ఎన్నికల సంఘం డీటీ తాజుద్దీన్, ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ జగన్మోహన్‌రెడ్డి, పీఆర్ డీఈ అనిల్‌కుమార్, ఆయా మండలాల అధికారులు పాల్గొన్నారు.

జెడ్పీటీసీ ఎన్నికలకు ఆర్వోల నియామకం

కందుకూరు డివిజన్‌లోని ఐదు మండలాల జెడ్పీటీసీ ఎన్నికల నిర్వహణకు రిటర్నింగ్ అధికారులను నియమించినట్లు ఆర్డీవో తెలిపారు. మహేశ్వరం మండలానికి ఉద్యానవన శాఖ డీడీ సురేష్‌ను నియమించామన్నారు. అలాగే కందుకూరుకు మహేశ్వరం వ్యవసాయ శాఖ ఏడీఏ సుధారాణి, ఆమనగల్లుకు ఆమనగల్లు వ్యవసాయ శాఖ ఏడీఏ శోభారాణి, కడ్తాల్‌కు జిల్లా డీటీసీడీవో కిశోర్, తలకొండపల్లి మండలానికి పీఆర్ డీఈ అనిల్‌కుమార్‌లను నియమించినట్లు ఆయన తెలిపారు.



మాట్లాడుతున్న మాజీ మంత్రి మల్లారెడ్డి

యువ నాయకులు ప్రజాసేవలో ముందుండాలి

- మాజీ మంత్రి, ఎమ్మెల్యే మల్లారెడ్డి

ఘట్‌కేసర్, సెప్టెంబరు30(ఆంధ్రజ్యోతి): యువ నాయకులు ప్రజాసేవలో ముందుండాలని మేడ్చల్ ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి అన్నారు. దసరా సందర్భంగా మంగళవారం పోచారానికి చెందిన బీఆర్ఎస్ నాయకుడు సామల సందీప్‌రెడ్డి మున్సిపాలిటీలో పనిచేసే 450 మంది సిబ్బందికి భోజనాలు ఏర్పాటు చేసి వారికి నూతన వస్త్రాలను పంపిణీ చేశారు. అలాగే ఒక్కొక్కరికి రూ.500 నగదు చొప్పున నగదు అందజేశారు. ఈ కార్యక్రమాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే మాట్లాడుతూ నాయకులు ప్రజలకు నిరంతరం అందుబాటులో ఉంటూ వారికి చేయూతనందించాలని కోరారు. ఈ సందర్భంగా సందీప్‌రెడ్డి ఉదారత అభినందనీయమన్నారు. కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మన్ బోయపల్లి కొండల్‌రెడ్డి, నాయకులు సంజీవరెడ్డి, కొండల్‌రెడ్డి, బుచ్చిరెడ్డి, శంకర్, బాల్‌రెడ్డి, రాజేశ్వర్‌రెడ్డి, వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.

ధారూరు ప్యాక్స్‌కు రూ.1.21కోట్ల ఆదాయం

- పీఏసీఎస్ చైర్మన్ వై.సత్యనారాయణరెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న చైర్మన్ సత్యనారాయణరెడ్డి

ధారూరు, సెప్టెంబరు 30(ఆంధ్రజ్యోతి): ఈ ఏడాది ధారూరు సొసైటీకి రూ.1.21కోట్ల ఆదాయం సమకూరిందని పీఏసీఎస్ చైర్మన్ వై.సత్యనారాయణరెడ్డి తెలిపారు. మంగళవారం సొసైటీ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. చైర్మన్ మాట్లాడుతూ.. బంగారు ఆభరణాలపై రూ.3.93కోట్ల రుణాలు ఇచ్చామని తెలిపారు. స్వల్పకాలిక రుణాలు రూ.16.39కోట్లు, దీర్ఘకాలిక రుణాలు రూ.11.25కోట్ల రుణాల బకాయిలు రావాల్సి ఉందన్నారు. రుణాలు పొందిన వెంటనే తిరిగి చెల్లించాలని కోరారు. సొసైటీకి నాగారం, కేరెల్లిలో రెండు ఎకరాల భూమి ఉందని తెలిపారు. రైతులకు మెరుగైన సేవలందించేందుకు పాలకవర్గం, సిబ్బంది కృషిచేస్తామని చెప్పారు. అనంతరం సంఘంలో కామన్ సర్వీస్ సెంటర్‌ను ప్రారంభించారు. ఇందులో రైతులకు అవసరమైన సర్టిఫికెట్లను అందజేస్తామని తెలిపారు, సమావేశంలో సీఈవో నర్సింహులు, డైరెక్టర్లు సుధాకర్‌గౌడ్, గోపాల్‌రెడ్డి, అబ్దుల్ కరీం, తుల్జానాయక్, రైతులు పాల్గొన్నారు.

తొండుపల్లి ఫ్లై ఓవర్‌పై ట్రాఫిక్ జామ్

ఎయిర్ పోర్టు ప్రయాణికుల ఇబ్బందులు

శంషాబాద్, సెప్టెంబరు 30(ఆంధ్రజ్యోతి):శంషాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని తొండుపల్లి ఫ్లైఓవర్ వద్ద మంగళవారం రాత్రి ట్రాఫిక్‌జామ్‌తో ఎయిర్‌పోర్టుకు వెళ్తున్న ప్రయాణికులు, ఇతర ప్రాంతాలకు వెళ్లాల్సిన వారు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఫ్లైఓవర్‌పై ఒకపక్క రోడ్డు రిపేర్ చేసిన క్రమంలో వాహనాలు నెమ్మదిగా కదిలాయి. రెండు కిలో మీటర్ల మేర వాహనాలు నిలిచి పోయాయి. పోలీసులు ట్రాఫిక్‌ను కంట్రోల్ చేశారు.

విమానం రెస్ట్‌రూంలో ధూమపానం

వ్యక్తిపై కేసు నమోదు చేసిన ఆర్జీఐఏ పోలీసులు

శంషాబాద్, సెప్టెంబరు 30(ఆంధ్రజ్యోతి): దుబాయ్ నుంచి శంషాబాద్ ఎయిర్‌పోర్టుకు వస్తున్న విమానంలో మంగళవారం రాత్రి రెస్ట్‌రూంలో సిగరెట్ కాలుస్తున్న ఓ ప్రయాణికుడిపై ఆర్జీఐఏ పోలీసులు కేసు నమోదు చేశారు. కరీంనగర్‌కు చెందిన ప్రయాణికుడు దుబాయ్ నుంచి విమానంలో వస్తూ రెస్ట్ రూంలో సిగరెట్ తాగాడు. గమనించిన సిబ్బంది విమానం దిగగానే ఆ ప్రయాణికుడిని పోలీసులకు అప్పగించారు. అతడిపై కేసు నమోదు చేశారు.

రేపు మాంసం దుకాణాలు బంద్


మాంసం దుకాణదారులకు నోటీసులు ఇస్తున్న అధికారులు

తాండూరు, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో గాంధీ జయంతి పురస్కరించుకొని గురువారం (రేపు) మాంసం దుకాణాలు బంద్ పాటించాలని మున్సిపల్ అధికారులు మటన్ షాపులు, హోటల్ యజమానులకు సూచించారు. ఈ మేరకు మంగళవారం నోటీసులు అందజేశారు. మటన్, చికెన్, చేపలు, పశువుల మాంసం విక్రయించినా, హోటళ్లను నిర్వహించినా చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని మున్సిపల్ కమిషనర్ యాదగిరి నోటీసుల్లో పేర్కొన్నారు.


ఘట్‌కేసర్ రూరల్: ప్రతాప్‌సింగారంలో అమ్మవారిని దర్శించుకున్న మాజీ ఎమ్మెల్యే మలిపెద్ది సుధీర్‌రెడ్డి


ఘట్‌కేసర్ రూరల్: అవుశాపూర్‌లో హోమం నిర్వహిస్తున్న బీఆర్ఎస్ మండల ప్రధానకార్యదర్శి కొండల్‌రెడ్డి దంపతులు


తాండూరు: దుర్గామాతను దర్శించుకున్న ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి


బొంరాస్‌పేట్: దుర్గామాత ఆలయం వద్ద సామూహిక కుంకుమార్చనలో భక్తులు

దుర్గాదేవీ నమోస్తుతే

దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా మంగళవారం అమ్మవారు దుర్గామాతగా భక్తులకు దర్శనమిచ్చారు. అమ్మవారికి పూజలు చేసి నైవేద్యం సమర్పించారు. ప్రజాప్రతినిధులు ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. పలు మండపాల్లో అన్నదానం చేశారు.
- ఆంధ్రజ్యోతి నెట్‌వర్క్


పరిగి: ఆర్టీసీ డిపోలో ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి పూజలు


పరిగి: ఆర్టీసీ డిపోలో మాజీ ఎమ్మెల్యే మహేశ్‌రెడ్డి పూజలు


శామీర్‌పేట మండలం లక్ష్మాపూర్‌లో దుర్గాదేవి అవతారంలో అమ్మవారు


చౌడాపూర్‌లో..


ఘట్‌కేసర్: ఎన్ఎఫ్‌సీనగర్‌లోని శివశంకర వేదపీఠంలో..


ధారూరులో


వికారాబాద్: శివాజీనగర్ కాలనీలో కుంకుమార్చన


తూంకుంట శ్రీగాయత్రి మహాక్షేత్రంలో..


చౌడాపూర్: మందిపాల్‌లో దుర్గమాత పూజల్లో భక్తులు


ఘట్‌కేసర్: దుర్గా హోమంలో మాజీ కౌన్సిలర్ బొక్క సంగీతాప్రభాకర్‌రెడ్డి దంపతులు


తాండూరు: అమ్మవారి రూపంగా భావిస్తూ తొమ్మిది మంది చిన్నారులకు బహుమతులు అందజేస్తున్న మాజీ కౌన్సిలర్ సంగీత ఠాకూర్


మోమిన్‌పేట్: టేకులపల్లి శివాయంలో దుర్గాదేవికి పూజలు నిర్వహిస్తున్న భక్తులు


వికారాబాద్: ఎల్లమ్మ దేవాలయంలో పూజలు నిర్వహించిన భక్తులు

ఎన్నికల నియమావళి ఉల్లంఘిస్తే చర్యలు


పరిగి: రంగాపూర్‌లో గోడరాతలను తొలగింపజేస్తున్న ఎంపీడీవో కరీం


కులకచర్ల చౌరస్తాలో ఫ్లెక్సీలు తొలగిస్తున్న పంచాయతీ సిబ్బంది

పరిగి, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల నియమావళి ఉల్లంఘిస్తే చర్యలు తప్పవని ఎంపీడీవో ఎంఏ కరీం అన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల షెడ్యూల్‌ను ప్రకటించిన నేపథ్యంలో మంగళవారం రంగాపూర్ గ్రామంలో గోడలకు రాతలను తూడిచివేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాజకీయ పార్టీలకు సంబంధించి ఫ్లెక్సీలు, రాతలు ఎక్కడ కనిపించకూడదని కార్యదర్శులకు సూచించారు. రాజకీయ పార్టీల నాయకులు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో విశ్వతేజ పాల్గొన్నారు.

కులకచర్ల: మండల కేంద్రంలో మంగళవారం పంచాయతీ సిబ్బంది రాజకీయ ఫ్లెక్సీలు, బ్యానర్లు, పోస్టర్లను తొలగించారు. ఎన్నికలు ముగిసేంత వరకు ఎలాంటి ఫ్లెక్సీలు పెట్టరాదని అధికారులు ఆదేశించారు.

వడ్డీరాయితీని వినియోగించుకోవాలి


మాట్లాడుతున్న విష్ణువర్ధన్‌రెడ్డి

పెద్దేముల్, సెప్టెంబర్ 30(ఆంధ్రజ్యోతి): రైతులు వడ్డీ రాయితీని సద్వినియోగం చేసుకోవాలని రైతుసేవా సహకార సంఘం అధ్యక్షుడు ద్యావరి విష్ణువర్ధన్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రంలోని ఎఫ్ఎస్‌సీఎస్‌లో మంగళవారం సర్వసభ్య సమావేశం జరిగింది. ఈసందర్భంగా పలువురు రైతులు యూరియా విషయమై ప్రశ్నించారు. 10 ఎకరాలు ఉన్న రైతుకు ఒక బస్తా యూరియా ఇస్తే ఏం చేసుకోవాలని, అందరికీ సరిపడా యూరియా అందజేయాలని కోరారు. వివిధ గ్రామాల్లో యూరియాను నిల్వచేసి ఎక్కడి రైతులకు అక్కడే ఇవ్వాలన్నారు. అందుకు అధ్యక్షులు విష్ణువర్ధన్‌రెడ్డి మాట్లాడుతూ క్లస్టర్‌వారీగా యూరియాను అందజేసేందుకు కృషి చేస్తానని చెప్పారు. నానోయూరియా కూడా అందుబాటులో ఉందని, అవసరమైన రైతులు తీసుకోవాలని అన్నారు. 31-12-2018 వరకు రుణాలు తీసుకుని చెల్లించలేని రైతులకు వడ్డీలో 25శాతం రాయితీ ఇస్తున్నామని చెప్పారు.

కొడంగల్ తహసీల్దార్‌గా రాంబాబు



కొడంగల్, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి): కొడంగల్ తహసీల్దార్‌గా విధులు నిర్వహిస్తున్న దీపక్ శ్యామ్సన్ బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో నూతన తహసీల్దార్‌గా హైదరాబాద్‌లోని సెక్రటేరియట్‌లో విధులు నిర్వహిస్తున్న పి.రాంబాబు మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండల ప్రజలకు ఎల్లవేళాల అందుబాటులో రెవెన్యూ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు.

స్థానిక ఎన్నికల్లో బీఆర్ఎస్‌దే విజయం

- మాజీ ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి


సమావేశంలో మాట్లాడుతున్న రోహిత్‌రెడ్డి

తాండూరు, సెప్టెంబరు 30(ఆంధ్రజ్యోతి): రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీదే విజయమని మాజీ ఎమ్మెల్యే పైలెట్ రోహిత్‌రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. పట్టణంలోని తన క్యాంపు కార్యాలయంలో మంగళవారం నియోజకవర్గ పరిధిలోని వివిధ మండలాల ముఖ్య కార్యకర్తల సమావేశంలో మాట్లాడారు. ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల్లో బీఆర్ఎస్ అత్యధిక స్థానాలను కైవసం చేసుకుంటుందన్నారు. ప్రజలు కాంగ్రెస్ ఆరు గ్యారంటీలు, 420 హమీలు అమలు చేయకుండా ప్రజలను మోసం చేసిందని ఆరోపించారు. బీఆర్ఎస్ శ్రేణులు బాకీకార్డు పేరిట ఇంటింటికీ వెళ్లి కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలు ప్రజలకు తెలియజేయాలని అన్నారు. ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహాలపై పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేశారు. ఈ సమావేశంలో పార్టీ సీనియర్ నాయకులు రాజప్పగౌడ్, రాంలింగారెడ్డి, రమేశ్, తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు మరమ్మతులు చేపట్టాలి


మోమిన్‌పేట్-శంకర్‌పల్లి ప్రధాన రోడ్డుపై నిరసన తెలుపుతున్న గోపాల్‌రెడ్డి, సీపీఐ నాయకులు

మోమిన్‌పేట్, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి): మోమిన్‌పేట్ నుంచి శంకర్‌పల్లికి వెళ్లే ప్రధాన రోడ్డు మరమ్మతులు చేపట్టాలని సీపీఐ జిల్లా ప్రధాన కార్యదర్శి గోపాల్‌రెడ్డి అన్నారు. అధ్వానంగా మారిన రోడ్డుపై మంగళవారం ఆయన నిరసన వ్యక్తం చేశారు. భారీ వర్షాలకు ప్రధాన రోడ్లు, గ్రామాలకు వెళ్లే రోడ్లు అధ్వానంగా మారాయన్నారు. మండలంలోని దుర్గం చెరువు, రాళ్లగూడుపల్లి, సైదలిపూర్, గోవిందాపూర్ నుంచి రాంనాథ్‌గూడుపల్లి, ఎన్కతల నుంచి టేకులపల్లి, సదాశివపేట్ వరకు రోడ్లు పూర్తిగా దెబ్బతిన్నాయన్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి రోడ్ల మరమ్మతుకు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

రుణాలు సకాలంలో చెల్లించాలి

నవాబుపేట, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి): రైతులు తీసుకున్న రుణాలను సకాలంలో చెల్లించాలని పీఏసీఎస్ చైర్మన్ రాంరెడ్డి అన్నారు. ఆయన మంగళవారం మండల కేంద్రంలోని పీఏసీఎస్ కార్యాలయలంఓ సమావేశం నిర్వహించారు. రైతులు సకాలంలో రుణాలు చెల్లించకుంటే వడ్డీ పెరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో సీఈవో మోహన్‌రెడ్డి, వైస్ చైర్మన్ నర్సింహ్మారెడ్డి, డైరెక్టర్‌లు విఠల్‌రెడ్డి పాల్గొన్నారు.

క్రైం కార్నర్

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి దుర్మరణం

- ఓఆర్ఆర్‌పై బైక్‌ను ఢీకొన్న కారు


ప్రమాదంలో ధ్వంసమైన బైక్

మేడ్చల్ టౌన్, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి): మేడ్చల్ ఓఆర్ఆర్‌పై కారు బైక్‌ను ఢీకొని ఓ వ్యక్తి దుర్మరణం చెందాడు. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మెదక్ జిల్లా నార్సాపూర్ మండలం గొల్లపల్లికి చెందిన బి.కృష్ణ(52) మంగళవారం దుండిగల్ ఓఆర్ఆర్ 5 ఎగ్జిట్ టోల్‌గేట్ ఎక్కి తన బైక్‌పై రాంగ్ రూట్‌లో శామీర్‌పేట్ టోల్‌గేట్ వైపు వస్తున్నాడు. ఈ క్రమంలో మేడ్చల్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని మునీరాబాద్ గ్రామ సమీపంలో ఎదురుగా వస్తున్న కారు బైక్‌ను ఢీకొంది. ఈ ప్రమాదంలో కృష్ణ తీవ్రగాయాలపాలై అక్కడికక్కడే దుర్మరణం చెందాడు. ఓఆర్ఆర్ సిబ్బంది ఇచ్చిన సమాచారం మేరకు పోలీసులు ఘటనాస్థలాన్ని పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నగరంలోని గాంధీ మార్చురీకి తరలించారు. మృతుడి కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

టోల్‌గేట్ సిబ్బంది తీరుపై విమర్శలు

ఓఆర్ఆర్‌పై టూ, త్రీ వీలర్ వాహనాల రాకపోకలు పూర్తిగా నిషేధించబడిన విషయం తెలిసిందే. ఈనేపథ్యంలో ఓఆర్ఆర్‌పై సిబ్బంది చూసీచూడనట్లుగా వ్యవహరిస్తుండం వల్లే ఇలాంటి ప్రమాదాలు జరుగుతున్నాయని స్థానికులు అంటున్నారు. బైక్‌పై ఓఆర్ఆర్‌పై రాంగ్ రూట్‌లో వెళ్లిన కృష్ణ ప్రమాదంలో మృతిచెందడంతో స్థానికులు ఓఆర్ఆర్ సిబ్బంది పనితీరును తప్పుబడుతున్నారు. కాగా విధులు నిర్వహిస్తున్న సిబ్బంది అడ్డగించే ప్రయత్నం చేసనప్పటికీ కృష్ణ ఆపకుండా రింగ్‌రోడ్డు ఎక్కివెళ్లినట్లు సమాచారం.

గడువు తీరిన కుర్‌కురే తిన్న బాలుడికి అస్వస్థత

ధారూరు, సెప్టెంబరు30(ఆంధ్రజ్యోతి): గడువుతీరిన కుర్‌కురే తిని బాలుడు అస్వస్థతకు గురయ్యాడు. వివరాల్లోకి వెళితే.. ఇమ్రాన్(11) అనే బాలుడు ధారూరు చౌరస్తాలోని తాండూర్-వికారాబాద్ రోడ్డులో ఉన్న ఓ కిరాణ దుకాణంలో మంగళవారం కుర్‌కురే ప్యాకెట్లు కొనుగోలు చేశాడు. కుర్‌కురే ప్యాకెట్ విప్పి తిన్న ఇమ్రాన్ కొద్దిసేపటికే వాంతులు చేసుకుని అస్వస్థతకు గురయ్యాడు. బాలుడికి ధారూరులోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స అందించారు. కాగా కుర్‌కురే ప్యాకెట్ గడువు తేదీ 10.8.25గా ముద్రించి ఉంది. గడువు తీరిన కుర్‌కురే ప్యాకెట్లను దుకాణం యజమాని విక్రయించడంతో బాలుడు వాటిని తిని వాంతులు చేసుకున్నాడని కుటుంబసభ్యులు తెలిపారు.

సద్దుల బతుకమ్మ సందడి

వికారాబాద్, తాండూరు, బొంరాస్‌పేట్, శామీర్‌పేటలో మంగళవారం సద్దుల బతుకమ్మ సంబురాలు ఘనంగా నిర్వహించారు. తీరొక్క పూలతో బతుకమ్మలను పేర్చి ఆడిపాడారు. అనంతరం బతుకమ్మలను సమీప చెరువుల్లో నిమజ్జనం చేశారు.
- ఆంధ్రజ్యోతి నెట్‌వర్క్


వికారాబాద్ పట్టణంలో బతుకమ్మతో ఓ చిన్నారి


తాండూరు: సాయిపూర్‌లో బతుకమ్మ ఆడుతున్న మహిళలు


బొంరాస్‌పేట్: బతుకమ్మ ఆడుతున్న మహిళలు


బొంరాస్‌పేట్‌లో బతుకమ్మతో యువతి


శామీర్‌పేటలో సద్దుల బతుకమ్మ వేడుకలో మహిళలు


తాండూరు: బతుకమ్మతో మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ పట్లోళ్ల దీప నర్సిములు

సంక్షిప్తంగా..

సబ్‌స్టేషన్‌లో ఆయుధ పూజ

యాలాల: మండల కేంద్రంలోని విద్యుత్ సబ్‌స్టేషన్ కార్యాలయంలో మంగళవారం ఆయుధ పూజ నిర్వహించారు. ఈ పూజా కార్యక్రమంలో యాలాల మండల కాంగ్రెస్ సీనియర్ నాయకులు పేరి రాజేందర్‌రెడ్డి, జిల్లా మాజీ అధ్యక్షుడు అక్బర్‌బాబా, లైన్ అధికారులు, గ్రామ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయాలి

చౌడాపూర్: ప్రభుత్వం ఇందిరమ్మ ఇంటిని మంజూరు చేయాలని మండలంలోని కొత్తపల్లి గ్రామానికి చెందిన జంబుల పార్వతమ్మ అధికారులతో మొరపెట్టుకుంటుంది. కనీసం ఉండేందుకు ఇల్లు లేదని తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని మంగళవారం విలేకరుల ముందు తన గోడును వినిపించింది. ఇంటి మంజూరు కోసం అర్హత కలిగి ఉన్నా ఇందిరమ్మ ఇళ్ల జాబితాలో పేరు వచ్చినా మంజూరు కాలేదన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వ అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి తనకు ఇందిరమ్మ ఇంటిని మంజూరు చేయాలని వాపోయింది.

వృద్ధులకు సాయం చేస్తాం

కీసర: వృద్ధులు, వయో వృద్ధులకు చట్టపరంగా తమవంతు సాయం చేస్తామని కీసర పోలీస్‌స్టేషన్ సీఐ ఆంజనేయులు అన్నారు. రాచకొండ పోలీస్ కమిషనర్ సుధీర్‌బాబు ఆదేశాల మేరకు 'మన కోసం శ్రమించే వారి కోసం మన సంరక్షణ' పేరిట రాచకొండ కమిషనరేట్‌లో వినూత్న కార్యక్రమం చేపట్టారు. మంగళవారం కీసరలో సీఐ ఆంజనేయులు వృద్ధులను కలిసి వారి యోగక్షేమాలు తెలుసుకున్నారు. ఆనంతరం వారికి జూట్ బ్యాగులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ నాగరాజు, వెంకటేష్, హరిప్రసాద్, శ్రీనివాస్‌రెడ్డి

హకీంపేట్ పీహెచ్‌సీలో దంత వైద్యశిబిరం

దుద్యాల: స్వస్త్ నారీ స్వశక్త్ పరివార్ అభియాన్ మెగాహెల్త్ క్యాంపులో భాగంగా మండలంలోని హకీంపేట్ పీహెచ్‌సీలో మంగళవారం ఉచిత దంత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో 66మందికి పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి మందులను పంపిణీ చేసినట్లు వైద్యురాలు వందన తెలిపారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ డైరెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి, నాయకులు యుగంధర్‌రెడ్డి, బిచ్చప్ప పాల్గొన్నారు.

ఆర్ఎస్ఎస్ శతాబ్ది ఉత్సవాలు

దోమ: ఆర్ఎస్ఎస్ శతాబ్ది ఉత్సవాల్లో భాగంగా మండలంలోని దాదాపూర్‌లో ఆర్ఎస్ఎస్ శాఖ ఆధ్వర్యంలో ప్రభోదన్ వక్త రూప్‌ఖాన్ పేట్ కృష్ణయ్య మంగళవారం కార్యకర్తలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఆర్ఎస్ఎస్ కార్యకర్తలు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

పాస్టర్స్ మేడ్చల్ మండల కమిటీ ఎన్నిక

మేడ్చల్ టౌన్: పాస్టర్స్ మేడ్చల్ మండల నూతన కమిటీని మంగళవారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా డేవిడ్ మహేశ్వరం, ఉపాధ్యక్షుడిగా పాస్టర్ జనార్ధన్ జోయేల్, ప్రధాన కార్యదర్శిగా పాస్టర్ భాస్కర్‌పాల్, కోశాధికారిగా పాస్టర్ విలియం కేరీ, సహాయ కార్యదర్శిగా పాస్టర్ పాస్టర్ కిషన్, కార్యవర్గ సభ్యులుగా పాల్ మోజేస్, కె.ప్రసాద్ రాజులను ఎన్నుకున్నారు.

ఎల్లమ్మ ఆలయం వద్ద అన్నప్రసాద వితరణ

శామీర్‌పేట: శ్రీరేణుకా ఎల్లమ్మ ఆలయం వద్ద మంగళవారం గౌడ సంఘం ఆధ్వర్యంలో అన్నదానం చేపట్టారు. భక్తులు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అల్వాల్‌కు చెందిన ప్రేమ్‌కుమార్ వారి కుటుంబసభ్యులు 50కేజీల బియ్యం అందచేశారు. అదేవిధంగా తూంకుంటకు చెందిన మాధవరెడ్డి 25కేజీల బియ్యం, అలియాబాద్‌కు చెందిన సాయికృష్ణ 25కేజీల బియ్యం అందజేశారు. మండలంలోని వివిధ గ్రామాల మాజీ ప్రజాప్రతినిధులు, భక్తులు, భక్తులు అన్నప్రసాదం స్వీకరించారు.